# పదో తరగతి పరీక్షలు ప్రారంభం

- గంటన్నర ముందుగానే పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు
- ఎగ్జామ్ ముగిసే వరకు నిరీక్షించిన తల్లిదండ్రులు



ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్ వద్ద విద్యార్థులు, తల్లిదండ్రుల సందడి



మధురానగర్ హైస్కూల్ వద్ద హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్ వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

**సీతంపేట:** విద్యార్థి దశలో కీలకమైన పదో తరగతి పరీక్షలు సోమవారం ఉత్తర నియోజకవర్గంలో ప్రశాంతంగా ప్రారంభయ్యాయి. నియోజకవర్గంలోని 8 జీవీఎంసీ, 2 ఎయిడెడ్, 8 ప్రైవేటు.. మొత్తం 18 పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. తొలి రోజు తెలుగు పరీక్ష జరిగింది. ఉదయం 8 గంటల నుంచే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కేంద్రాలకు చేరుకోవడంతో సందండి నెలకొంది. 8.50 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులు తమ సీటు హాల్ టికెట్ నంబర్ ఏ రూమ్‌లో కేటాయించారో వెతుకులాడుతూ అవస్థలు పడ్డారు. రూమ్ కేటాయింపులపై స్కూళ్ల వద్ద చిన్న చిన్న కాగితాలపై అంకెలతో బోర్డులు ఏర్పాటు చేశారు. హాల్ టికెట్ నంబర్ వెతుకులాటలో విద్యార్థుల వెంట వచ్చిన పెద్దలు ఇబ్బంది పడ్డారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్ష జరిగింది.

**నూరు శాతం హాజరు..**

జీవీఎంసీ 25, 26 వార్డుల్లో నాలుగు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసారు. మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్, రాజేంద్రనగర్ వీటీ హైస్కూల్, అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ హైస్కూల్, ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో సందడి వాతావరణం నెలకొంది. ఎన్జీజీవోస్ కాలనీ హైస్కూల్‌కు కేటాయించిన 167 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. జ్ఞాననికేతన్ హైస్కూల్‌లో 200 మందికి అందరూ హాజరయ్యారు. మధురానగర్ హైస్కూల్‌లో 203 మందికి అందరూ హాజరయ్యారు. నాలుగు పరీక్ష కేంద్రాల్లో నూరు శాతం హాజరుతో పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్ష పూర్తయ్యే వరకు తల్లిదండ్రులు పాఠశాల చుట్టుపక్కల చెట్ల నీడలో నిరీక్షిస్తూ కన్పించారు.

**పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు**

**సీతమ్మధార:** పీ అండ్ టీ కాలనీలోని ఎన్ఎంసీహెచ్ స్కూల్ పరీక్ష కేంద్రానికి ఉదయం 8 గంటలే తల్లిదండ్రులు కలిసి పదో తరగతి విద్యార్థులు చేరుకున్నారు. ఈ స్కూల్‌లో 11 రూమ్‌లు కేటాయించారు. 248 మంది గానూ 247 మంది తొలి రోజు హాజరయ్యారు. పరీక్ష రాస్తున్న సమయంలో ఓ విద్యార్థిని వాంతులు చేసుకోవడంతో వెంటనే ఏఎన్ఎం, ఆశా వర్కర్ చికిత్స అందించారు. పది నిమిషాల్లో ఆ బాలిక పరీక్షకు హాజరైంది. ఫోర్త్‌టౌన్, ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ల పరిధిలో 13 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. సీఐలు సింహాద్రినాయుడు, శ్రీనివాసరావు వాటి వద్దకు వెళ్లి పరిశీలించారు. మహిళా పోలీసులు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. హెచ్ఎం రాంప్రసాద్ పర్యవేక్షించారు. సీతమ్మధార ఎస్ఎఫ్ఎస్ స్కూల్, ఆదర్శ, నారాయణ పాఠశాలల్లో టెన్త్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

**191కి 188 మంది హాజరు..**

**మురళీనగర్:** మురళీనగర్ ప్రాంతంలోని మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రానికి 191 మంది విద్యార్థులను కేటాయించారు. వీరిలో రెగ్యులర్ 180 మంది, ప్రైవేటు 11 మంది ఉన్నారు. వీరికి 8 గదులను పరీక్షలు రాయడానికి కేటాయించారు. రెగ్యులర్ విద్యార్థుల్లో ఒకరు, ప్రయివేటు విద్యార్థుల్లో ఇద్దరు హాజరు కాలేదు. మొత్తంగా 188 మంది హాజరయ్యారు. విద్యార్థులకు అవసరమైన తాగు నీరు, మెడికల్ సదుపాయం కల్పించినట్లు చీఫ్ సూపరింటెండెంట్ బి.హేమలత చెప్పారు.

**కంచరపాలెం పరిధిలో సజావుగా ..**

**కంచరపాలెం:** కంచరపాలెం, ఐటీఐ జంక్షన్, మర్రిపాలెం, జ్ఞానాపురం తదితర ప్రాంతాల్లోని పరీక్ష కేంద్రాలకు ఉదయం 8 గంటలకే టెన్త్ విద్యార్థులు చేరుకున్నారు. జ్ఞానాపురం పరిధిలో సేక్రెడ్ హార్ట్ బాలికలు, ఏకేఎం జూబ్లీ, సెయింట్ పీటర్స్ బాలుర ఎయిడెడ్ పాఠశాలలు, కంచరపాలెం పరిధిలో రామ్మూర్తిపంతులుపేట జీవీఎంసీ హైస్కూల్, ఐటీఐ జంక్షన్ పరిధిలో కప్పరాడ హైస్కూళ్ల సందడి వాతావరణం నెలకొంది. తొలి రోజు తెలుగు పరీక్ష సజావుగా నిర్వహించారు. ఆయా పరీక్ష కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు, వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది సేవలు అందజేశారు.



కప్పరాడ సెంటర్ వద్ద పరీక్ష రాసేందుకు సిద్ధమవుతున్న విద్యార్థులు





ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో పరీక్ష రాసి బయటకు వస్తున్న దివ్యాంగ విద్యార్థి, బాలబాలికలు

## పోగొట్టుకున్న హాల్ టికెట్ అందజేత

**సీతమ్మధార:** పీ అండ్ టీ కాలనీ ఎన్ఎంసీహెచ్ స్కూల్‌లో పదో తరగతి తొలి రోజు పరీక్ష రాసి తిరిగి ఇంటికి వెళ్లే సమయంలో ఓ విద్యార్థిని హాల్ టికెట్ జారవిడిచింది. అక్కడే విధులు నిర్వహిస్తున్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సురేష్‌కు అది దొరికింది. వెంటనే ఆయన ఎవరైనా హాల్ టికెట్ పోగొట్టుకున్నారా.. అని అనౌన్స్ చేశారు. హాల్ టికెట్ పోవడం గమనించిన సదరు విద్యార్థిని తండ్రికి చెప్పడంతో అతడు వెంటనే స్కూల్ వద్దకు వచ్చాడు. వివరాలు తెలుసుకుని హెచ్‌సీ సురేష్ హాల్ టికెట్‌ను అందజేయడంతో బాలిక తండ్రి కృతజ్ఞతలు తెలిపారు. పోయిందనుకున్న హాల్ టికెట్ దొరకడంతో వారు ఊపిరి పీల్చుకున్నారు.



విద్యార్థిని తండ్రికి హాల్ టికెట్ అందిస్తున్న పోలీస్ హెడ్ కానిస్టేబుల్ సురేష్

## ప్రశాంతంగా బీటెక్ ఫస్టియర్ పరీక్షలు

**ఏయూ క్యాంపస్:** ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ ప్రథమ సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఈ పరీక్ష కేంద్రాలను ప్రిన్సిపాల్ ఆచార్య జి.శశిభూషణరావు తనిఖీ చేశారు. పరీక్ష జరుగుతున్న విధానం, ఏర్పాట్లపై ఆరా తీశారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించడంపై అధికారులను అభినందించారు. మొత్తం 1,300 మందికిపైగా విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. కార్యక్రమంలో చీఫ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.పాల్ డగ్లస్ తదితరులు పాల్గొన్నారు.

## గ్రూప్ లెర్నింగ్‌తో మెరుగైన అవగాహన



సాంబశివరావును సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు

**ఏయూ క్యాంపస్:** గ్రూప్ లెర్నింగ్‌తో మెరుగైన అవగాహన కలుగుతుందని ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ ఎన్.సాంబశివరావు అన్నారు. సోమవారం ఏయూ కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో విద్యార్థులనుద్దేశించి ఆయన విశిష్ట ప్రసంగం చేశారు. వార్తా పత్రికల్లో ఎడిటోరియల్ పేజీ ఎంతో ప్రధానమన్నారు. దీనిని చదవడం వల్ల విభిన్న అంశాలపై లోతైన అవగాహన ఏర్పడుతుందని, పోటీ పరీక్షల సమయంలో ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుందని చెప్పారు. నిర్దిష్ట విధానాలు అమలు చేస్తూ సంక్షేమ పథకాలు అందరికీ అందించాలన్నారు. పరీక్షలకు సన్నద్ధం అయ్యే విధానం, అవకాశాలు తదితర అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, విభాగాధిపతి ఆచార జాలాది రవి, ఆచార్య పి.విశ్వనాథం, ఆచార్య జి.సుదర్శన్‌రావు, రిటైర్డ్ ప్రొఫెసర్ డి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంబశివరావును విభాగం తరఫున సత్కరించారు.

## క్లుప్తంగా

### 'స్పందన'కు 25 అర్జీలు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ శ్యామ్‌ప్రసాద్

**సీతమ్మధార:** సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 25 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ రవి, వీఆర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

### పాపాహోం బాలికలకు అల్పాహారం



బాలికలతో కలిసి అల్పాహారం తింటున్న లక్ష్మీనారాయణ

**సీతమ్మధార:** సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ సోమవారం సీతమ్మధారలోని బాలికల పాపా హోంను సందర్శించారు. కొద్ది సేపు బాలికలతో చర్చించారు. బాలికలకు అల్పాహారం వడ్డించి వారితో కలిసి భోజనం తిన్నారు. తన పుట్టిన రోజు సందర్భంగా పదో తరగతి విద్యార్థులకు లక్ష్మీనారాయణ ఎగ్జామ్ కిట్లు అందజేశారు. బాగా చదివి మంచి పేరు తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాపా హోం ఉపాధ్యక్షుడు పి.వెంకటేశ్వరావు, ఈసీ సభ్యులు పి.భాస్కర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


### వ్యాపారం లేక పాడైన క్యాబేజీ



సీతమ్మధార రైతుబజార్‌లో పాడైన క్యాబేజీ

**సీతమ్మధార:** కొనుగోలుదారులు లేకపోవడంతో తాము తెచ్చిన క్యాబేజీ పాడైపోయి దుర్వాసన వెదజల్లుతోందని గ్రామీణ ప్రాంతాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతమ్మధార రైతుబజార్‌కు అరకు, ఇతర గ్రామీణ ప్రాంతాల నుంచి ప్రతి శుక్రవారం గిరిజన రైతులు క్యాబేజీ బుట్టలు తీసుకొచ్చి విక్రయాలు జరిపి తిరిగి సోమవారం పయనమవుతారు. కొద్ది రోజులుగా ఆశించిన స్థాయిలో క్యాబేజీ అమ్మకాలు లేకపోవడంతో సరకు మిగిలిపోయి పాడైపోతోంది. దీంతో రైతులు నిరాసతో వెనుదిరుగుతున్నారు.

### కొండవాలులో అభివృద్ధి పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న జోనల్ అధికారులు

**కంచరపాలెం:** జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి జైభారత్‌నగర్, ఇందిరానగర్ కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సోమవారం జోన్–5 ఇంజినీరింగ్ అధికారులు, కార్పొరేటర్ గంకల కవిత పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా ప్రజలకు దీర్ఘకాలిక సమస్యగా ఉన్న కవర్ శ్లాబ్ పనులను ఇటీవల ప్రారంభించారు. అవి చురుగ్గా సాగుతున్నట్లు స్థానిక వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు తెలిపారు.



## ఓటీఎస్‌తో ఆస్తిపై సర్వహక్కులు



జగనన్న ఇళ్ల పట్టా లబ్ధిదారులతో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

**మర్రిపాలెం:** ప్రభుత్వం అందిస్తున్న పక్కా ఇళ్లకు రిజిస్ట్రేషన్లతో ఆస్తిపై సర్వ హక్కులు సమకూరుతాయని 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పేర్కొన్నారు. కళింగనగర్ వార్డు కార్యాలయంలో సోమవారం 51వ వార్డు గాంధీనగర్ సచివాలయం పరిధి ఇళ్ల లబ్ధిదారులకు ఆయన జగనన్న సంపూర్ణ గృహ హక్కు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ద్వారా పొందిన పక్కా ఇళ్లకు సొమ్ము చెల్లించని కారణంగా రిజిస్ట్రేషన్లు జరక్క పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం తక్కువ మొత్తంతో ఓటీఎస్ పథకం కింద రిజిస్ట్రేషన్లు చేస్తోందన్నారు. దీంతో కేవలం పది నిమిషాల వ్యవధిలోనే ఆస్తి తనఖా, విక్రయించుకునే వెసులుబాటు ఉంటుందని చెప్పారు. ఈ ఆస్తులను 22(ఏ) సెక్షన్ నుంచి తొలగించారని స్పష్టం చేశారు. ఆర్థిక సంస్థలు, లేదా బ్యాంకు రుణాల కోసం ఈ డాక్యుమెంట్లను ష్యూరిటీగా సమర్పించవచ్చన్నారు. కార్యక్రమంలో 290 సచివాలయం సంక్షేమ కార్యదర్శి లక్ష్మి, వీఆర్వో సఖిన, బి.తిరుమలరావు, శ్యామ్, గణేష్, లబ్ధిదారులు బి.తిరుమలరావు, వి.పద్మ, వి.జగదీశ్వరి, బి.సింహాచలం, వి.కొర్లమ్మ, ఎస్.మోహన్ రావు, ఆర్.సొమ్మన్న తదితరులు పాల్గొన్నారు.

## మహిళా వాకర్ల వితరణ



కేర్ అండ్ లవ్ ఆశ్రమ పిల్లలకు భోజనాలు అందిస్తున్న మహిళా వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

**మురళీనగర్:** మహిళా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మాధవధార కేర్ అండ్ లవ్ ఆశ్రమంలో సోమవారం సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ ఆశ్రయం పొందుతున్న ఆడపిల్లలకు అవసరమైన నైటీలు అందించారు. క్లబ్ పూర్వ అధ్యక్షురాలు ఇ.శిరీష ఆర్థిక సాయం చేశారు. బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీమతి కృష్ణవేణి ఆర్థిక సాయంతో మధ్యాహ్న భోజనాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.శేషామణి, ఎస్.పుష్పలత ఉపాధ్యక్షులు సీహెచ్ వరలక్ష్మి, బోర్డర్ డైరెక్టర్లు కృష్ణవేణి, జి.లక్ష్మి, లావణ్య, సంస్థ సూపర్‌వైజర్ రమ్య పాల్గొన్నారు.


## ఉచిత నేత్ర వైద్య శిబిరం



చిట్టిబాబు కాలనీలో స్థానికులకు పరీక్షలు చేస్తున్న వైద్య బృందం

**తాటిచెట్లపాలెం:** జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం హైవే సమీపంలోని చిట్టిబాబు కాలనీలో సోమవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఉచిత మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమాన్ని రోటరీ క్లబ్ అధ్యక్షుడు మధు ప్రారంభించారు. డీవైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు మాట్లాడుతూ మురికివాడల్లోని పేదలకు వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రోటరీ క్లబ్, శంకర్ ఫౌండేషన్‌ల సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. దీని ద్వారా గుర్తించిన సుమారు 29 మందికి సర్జరీలు అవసరమని, వీరికి కూడా ఉచితంగా ఆపరేషన్లు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో రోటరీ అంబికా, వీసీసీ కో ఆర్డినేటర్ రమ, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సంతోష్, శ్రావణ్, శివ, చిట్టిబాబు కాలనీ, రామచంద్రనగర్, శివశంకర్ రజకుల కాలనీ, సంతోషిమాత కాలనీ, వైఎస్సార్ కాలనీ, ఏఎస్ఆర్ నగర్ కాలనీల వాసులు పాల్గొన్నారు.

## ఘనంగా పోలమాంబ తొలేళ్ల ఉత్సవం



పోలమాంబ అమ్మవారు

**ఏయూ క్యాంపస్:** శ్రీకరకచెట్టు పోలమాంబ అమ్మవారి తొలేళ్ల ఉత్సవం స్థానిక మద్దివారివీధిలోని పెద్దిల్లు వద్ద సోమవారం ఘనంగా జరిగింది. అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో సురేష్‌బాబా తెలిపారు.

**నేడు వార్షిక జాతర**

పండగలో భాగంగా ప్రధాన ఘట్టం అనుపు మహోత్సవం, వార్షిక జాతర మంగళవారం జరగనుంది. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే అమ్మవారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. ఆలయాన్ని వివిధ రంగుల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని ఇలవేల్పుగా కొలిచే పెదవాల్తేరు చుట్టుపక్కల 14 గ్రామాల ప్రజలు ఈ పండగకు తరలిరానున్నారు. పోలమాంబ ఆలయంలో పని చేస్తున్న 20 మంది సిబ్బందితో పాటు దేవదాయశాఖకు చెందిన సిబ్బంది 50 మంది వరకు ఉత్సవాల నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదం, మంచినీరు, మజ్జిగ పంపిణీకి ప్రత్యేక చర్యలు చేపట్టారు. ప్రాథమిక వైద్య శిబిరం, ప్రసాదాల విక్రయాలకు ప్రత్యేక, అదనపు కౌంటర్‌లను ఏర్పాటు చేశారు. భక్తుల సౌకర్యార్థం ఆలయం వద్ద ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఉచిత, రూ.50, రూ.100, రూ.500 దర్శనాలు అందుబాటులో ఉంచారు.

## ఇంద్రజాల ప్రదర్శన రేపు

**మురళీనగర్:** ఈ నెల 5న మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ నెలవారీ సమావేశం మురళీనగర్ వాకర్స్ పార్క్‌లో నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షురాలు ఎం.శేషామణి, కార్యదర్శి ఎస్.పుష్పలత ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు సాయంత్రం 5 గంటలకు ప్రారంభమయ్యే సమావేశం అనంతరం విద్యార్థుల మానసిక వికాసం, వినోదం, విజ్ఞానం కోసం ఇంద్రజాలికుడు హరీష్ పట్నాయక్ ఇంద్రజాల ప్రదర్శన ఉంటుందని చెప్పారు. మురళీనగర్, మాధవధార ప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రులు, వాకర్స్ సభ్యులు, ప్రజలు హాజరు కావాలని వారు కోరారు.

## కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు



**డాబాగార్డెన్స్:** విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనక మహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ వర్గాలు తెలిపాయి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ నిర్వహిస్తామని తెలిపారు.

## ఎమ్మెస్సీ నర్సింగ్ తరగతులు ప్రారంభం

**మహారాణిపేట:** ప్రభుత్వ నర్సింగ్ కళాశాలల్లో ఎమ్మెస్సీ నర్సింగ్ కోర్సులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఏఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. గవర్నమెంట్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ డాక్టర్ ఎం.సత్యవల్లి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కేజీహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ కె.విజయలక్ష్మి, స్కూల్ ఆఫ్ నర్సింగ్ ప్రిన్సిపాల్ సీహెచ్ సులోచన ఫ్లోరెన్స్ తదితరులు పాల్గొన్నారు.

## 'విజ్ఞానజ్యోతి' ట్రస్ట్ సేవా కార్యక్రమాలు



నిరాశ్రయులకు ఆహార పొట్లాలు అందిస్తున్న కీర్తి పట్నాయక్

**మురళీనగర్:** మహిళా సాధికారతకు తమ ట్రస్టు తరపున కృషి చేస్తానని శ్రీదేవి విజ్ఞానజ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ కుప్పిలి కీర్తి పట్నాయక్ అన్నారు. మురళీనగర్‌లోని కార్యాలయంలో సోమవారం ట్రస్టు వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నగరంలో పచ్చదనం పరిరక్షణకు మొక్కలు నాటి సంరక్షించే కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. ట్రస్టు స్థాపించి 20 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కీర్తి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పేద మహిళలకు చీరలు, 59 మంది నిరాశ్రయులకు ఆహారం పొట్లాలు, స్వీట్లు ఆమె అందించారు. కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

# బైబై.. బేబీ రిడ్లేస్



ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను సముద్రంలోకి విడిచి పెడుతున్న కార్పొరేటర్ కొండబాబు తదితరులు

**కొమ్మాది:** అంతరించిపోతున్న ఆలివ్ రిడ్లే తాబేళ్లను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు చేస్తున్న ప్రయత్నాలు సఫలమవుతున్నాయి. వాటి గుడ్లను సేకరించి, ప్రత్యేకంగా పొదిగించి పిల్లలను సముద్రంలోకి విడిచిపెట్టిన అద్భుత దృశ్యం సోమవారం ఆవిష్కృతమయ్యింది. బుల్లిబుల్లి తాబేళ్లు బుడిబుడి అడుగులు వేసుకుంటూ సాగరం వైపు సాగే దృశ్యాలు ప్రతి ఒక్కరికీ కనువిందు చేశాయి. జీవీఎంసీ 4వ వార్డు చేపలుప్పాడ తీరంలో 550 ఆలివ్ రిడ్లే తాబేలు పిల్లలను స్థానిక కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, అటవీశాఖ అధికారులు సముద్రంలోకి విడిచిపెట్టారు. పర్యావరణ ప్రేమికులు ఈ దృశ్యాన్ని చూసి పరవశించిపోయారు. బైబై బేబీ రిడ్లేస్ అంటూ తాబేళ్లకు వీడ్కోలు పలికారు.

## బడ్డీకొట్ల పునఃప్రారంభానికి చర్యలు చేపట్టండి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న మాధవధార చిల్లర వర్తకుల సంఘం నాయకులు

**మహారాణిపేట:** జీ20 సదస్సు ముగిసిన వెంటనే ఆర్ అండ్ బీ జంక్షన్ వద్ద తీసేసిన బడ్డీకొట్లను తిరిగి యథాస్థానంలో ఉంచుతామని ఇచ్చిన హామీపై తక్షణ చర్యలు చేపట్టాలని మాధవధార చిల్లర వర్తకుల సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. పీవోడబ్ల్యూ లక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం సంఘ అధ్యక్షుడు జి.నాగేశ్వరరావు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. 51వ వార్డు ఆర్ అండ్ బీ వద్ద 24 బడ్డీలు, నాలుగు తోపుడు బళ్లతో అనేక దశాబ్దాలుగా ఉపాధి పొందుతున్న వీధి విక్రయదారులు, చిరువ్యాపారులు ఉపాధి మీద ఆధార పడి జీవిస్తున్నామని వివరించారు. జీ20 సమ్మిట్ సందర్భంగా భద్రత కారణాల వల్ల తమ బడ్డీలను తొలగించారని, మళ్లీ అక్కడ పెట్టాలని కార్యదర్శి రామకృష్ణ కోరారు. దీనిపై కలెక్టర్ చొరవ తీసుకొని సమస్య పరిష్కారించాలని నాగేశ్వరరావు కోరారు.

## ఇబ్బందికరంగా కార్ల పార్కింగ్



సీతమ్మధార మూడు రోడ్ల జంక్షన్‌లో నిలిపిన కార్లు

**సీతమ్మధార:** రద్దీగా ఉన్న రహదారిలో అడ్డంగా కార్లు నిలిపివేయడంతో ట్రాఫిక్ జామైంది. సత్యం జంక్షన్ నుంచి సీతమ్మధార తహసీల్దార్ కార్యాలయం దరి మూడు రోడ్ల జంక్షన్‌లో అడ్డదిడ్డంగా కొందరు కార్లు పార్క్‌చేసి వదిలేశారు. దీంతో 20 నిమిషాల పాటు ట్రాఫిక్ నిలిచిపోయింది. ఇతర వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడ్డారు. గురుద్వారా నుంచి సీతమ్మధార రైతుబజారుకు వచ్చే ద్విచక్ర వాహనాలు, కార్లు, సత్యం జంక్షన్ నుంచి వచ్చిన వాహనాలు, అల్లూరి సీతారామరాజు జంక్షన్ నుంచి వచ్చిన వాహనాలు ఈ మూడు రోడ్ల కూడలిలో రాకపోకలు సాగిస్తుంటాయి. ఈ జంక్షన్ వద్ద కార్లు ఇబ్బందికరంగా నిలిపి వదిలేయడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారిందని పలువురు స్థానికులు చెబుతున్నారు. ట్రాఫిక్ అధికారులు దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.